
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 21 మే 2025





ఉష్ణోగ్రత (అంచనా) 21-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	26
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	34	26
చీరాల	34	27



డోర్ డెలివరీకి..

చెల్లుచీటి!

- ఇంటింటికీ సరుకుల పంపిణీ నిలిపివేత
- క్యాబినెట్ కమిటీ నిర్ణయంతో పాత పద్ధతికి స్వస్తి
- ఇకపై చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఎండీయూ వాహన సరఫరా విధానాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ- క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. సమావేశ అనంతరం వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తూ, గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు.

ఎండీయూపై ప్రజల్లో విముఖత

రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రకారం 25% మందికి నిత్యావసర సరుకులు అందకపోవడం, 26% మంది ఎండీయూ ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. దీంతో ప్రజల్లో విముఖత పెరిగింది. ప్రతి ఎండీయూ మూడు రేషన్ షాపులను ఇవ్వగా వారు నెలలో 15-17 రోజుల్లో మాత్రమే కవర్ చేస్తున్నారు. దీంతో కార్డుదారులకు సరుకులు అందడం లేదు. వాటిని దారి మళ్లించడంపై 288 కేసులు నమోదయ్యాయి. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా 570 మంది ఆపరేటర్ల కొరత ఉంది. దీనికి తోడు ఈవిధానం కారణంగా ప్రభుత్వంపై రూ.353.81 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

● డోర్ డెలివరీతో వర్రీ..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17,30,835 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి 3,384 రేషన్ షాపులు అందుబాటులో ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో జిల్లాలో 850 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ప్రజల కష్టాలను తగ్గించకపోగా మరింత పెంచింది. కూలీ, నాలీ చేసుకునే నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు రేషన్ సరుకులే ఆధారం. గతంలో కూలీ పనులకు వెళ్లి వచ్చి సమీపంలో ఉన్న రేషన్ షాపుల్లో సరుకులు తెచ్చుకునేవారు. డోర్ డెలివరీ విధానంలో ఎండీయూ వాహనం తమ ఇంటికి వచ్చే రోజు కోసం కార్డుదారులు ఎదురు చూడాల్సి వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటి దగ్గర ఉంటే అదృష్టం.. లేదంటే ఇక అంతే! ఆ కారణంగా లబ్ధిదారులు పనులు మానుకుని ఇళ్లదగ్గర ఉండాల్సి వచ్చేది. దీంతో వారు పనిదినాలు నష్టపోయి, ఆదాయాలు తగ్గిపోయాయి. ఎండీయూ తమ వీధికి వచ్చినా, ఆ రోజు కోటా అయిపోతే మళ్లీ వారు మరుసటి రోజు కూడా పని మానుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు మండు టెండలో రోడ్ల మీద ఎండీయూ వాహనాల దగ్గర గంటల తరబడి నించోవాల్సి వచ్చేది. దీంతో ఎండీయూ విధానం రద్దుచేయాలన్న డిమాండ్ గత కొంత కాలంగా బలంగా ముందుకు వచ్చింది. తాజాగా కేబినెట్ తీసుకున్న నేపథ్యంలో కార్డుదారులకు ఈ కష్టాలు తప్పినట్లే!

ప్రభుత్వం వరమిచ్చినా..

కరుణించని సాఫ్ట్‌వేర్



దేవుడు కరుణించినా.. ఎవరో కరుణించ లేదన్న చందంగా మారింది నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ. రైస్ కార్డును అర్హులైన పేదలకు మరింత చేరువ చేస్తామని సంతోషంగా ప్రకటించిన పౌరసరఫరాల శాఖ దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సిన విషయాన్ని మాత్రం మర్చిపోయింది. సర్వర్ సమస్యలతో ఒక్కో దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. రోజు మొత్తమ్మీద రెండు మూడుకు మించి దరఖాస్తులు పూర్తి కావడం లేదు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు ప్రభుత్వం నెల రోజులు గడువు ఇచ్చింది. ఇప్పటికే అందులో రెండు వారాలు పూర్తయ్యాయి.

- రైస్ కార్డు దరఖాస్తుల ఆన్‌లైన్‌లో తీవ్ర జాప్యం
- రెండు గంటలకు ఒక అప్లికేషన్ మాత్రమే పూర్తి
- ఒక్కో సచివాలయంలో 100కు పైగా పెండింగ్
- సాఫ్ట్‌వేర్ పాతదే కావడంతో నిరాశ
- సమస్యాత్మకంగా వివాహ ధ్రువీకరణ పత్రం
- వాట్సప్ గవర్నెన్సూ నిరాశే
- ముంచుకొస్తున్న గడువు గండం

● హౌస్‌హోల్డ్ సర్వేలో తప్పులు..

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి హౌస్‌హోల్డ్ సర్వే కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో పేర్ల నమోదు, ఇంటి నంబర్లు తప్పులు వేయడంతో ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. హౌస్ హోల్డ్ సర్వే వివరాలను డిలీట్ చేయడం, సవరించడం కుదరకపోవడంతో లబ్ధిదారులకు శాపాలుగా మారుతున్నాయి. సర్వేలో లోపాలు సవరించే అవకాశం కల్పిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది.



వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోడానికి ప్రయత్నిస్తే.. ఆప్షన్స్ కనిపించని పరిస్థితి

నరసరావుపేట, మే 20, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన హౌస్ హోల్డ్ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన తప్పులు ఇప్పుడు నిజమైన లబ్ధిదారులకు గుదిబండలా మా రుతున్నాయి. కేవలం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి, పాత కార్డుల్లో పుట్టిన సంతానాన్ని చేర్చుకోవడానికి మాత్రం అవకాశం లభిస్తోం ది. మిగిలిన 7 అంశాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో సర్వర్ మొరాయింపు కష్టాలు ఉదయం నుంచి రాత్రి వరకు లబ్ధిదారులను పడిగాపులు కాసేలా చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో సవరణలకు అసలు అవకాశమే ఇవ్వకపోవడం, అర్హులైన లబ్ధిదారులను కూడా రాజకీయ కక్షలతో తొలగించడం వంటి కారణాలతో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి నిరాశ తప్పడం లేదు.

పాత సాఫ్ట్‌వేర్‌తో కష్టాలు

పౌరసరఫరాల శాఖ పేదలకందించే రైస్ కార్డుల విషయంలో కొత్తవారికి అవకాశం కల్పించడం, మరో ఏడు అంశాలను సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే దీనికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను మాత్రం అప్‌డేట్ చేయలేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో విధించిన షరతులే ఇప్పుడూ వర్తిస్తున్నాయి. ఆరు అంచెల తనిఖీ విధానానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేషన్ కార్డు కోసం గత ప్రభుత్వంలో భూములు, వాహనాల విషయంలో పరిమితులు, విద్యుత్ వినియోగం యూనిట్‌ల పరిమితి వంటి వాటి ఆధారంగానే తీసుకున్న లబ్ధిదారుల అర్హతను ఇప్పుడూ నిర్ధారిస్తున్నారు. గతంలో కార్డుల్లో కోత విధించేందు కు వైసీపీ సర్కారు అనేక ఆంక్షలు పెట్టి.. చాలా కార్డులను తొలగించింది. దీంతో అర్హత ఉన్నా, చాలామంది పేద లు కార్డులు కోల్పోయారు. ఇప్పుడు అటువంటివారు దరఖాస్తు చేసుకుందామని చూస్తే మళ్లీ అవే షరతులు, అవే ఆటంకాలు వారికి రేషన్ కార్డు అందకుండా చేస్తున్నాయి.

వాట్సాప్ గవర్నెన్స్‌లో నో ఆప్షన్స్

కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 95523 00009 నంబర్‌కు కొత్త రైస్ కార్డుకు సంబంధించి ఏడు రకాల సేవలు అందుతాయని, ఈ నెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని ఆ శాఖ ప్రకటించింది. అయితే సేవను ఎంపిక చేస్తే ఇవేమీ రాకుండా, దీపం స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ వంటి కేవలం నాలుగు ఆప్షన్‌లు మాత్రమే వస్తున్నాయి. టోల్ ఫ్రీనంబర్ తెలుసుకుని వారికి కాల్ చేస్తున్నా స్పందన ఉండడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

☛ కూచిపూడికి చెందిన ఓ మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడు ఆమెకు ఒంటరి కార్డు తీసుకోవాలంటే ఎప్పు డో విడిపోయిన భర్త వచ్చి వేలిముద్ర వేయా లంట.

☛ 50 ఏళ్ల పైబడి ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పాత కార్డుల్లో ఉన్నవారికి ఇది వీలుకావడం లేదు. ఏ కార్డులో లేనివారికి అవకాశం లభిస్తోంది.

☛ నలుగురున్న కుటుంబంలో భార్య చనిపోయింది. ఆమెను డిలీట్ చేయాలని మరణ ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేస్తే, వారి పిల్లల ఆధార్ సీడింగ్ తప్పుగా నమోదైంది. దీంతో సింగిల్ పర్సన్‌ను డిలీట్ చేయటానికి వీలు కావటం లేదు.

☛ ఒకే రేషన్ కార్డులో అత్త, మామ, కొడుకు, కోడలు నలుగురున్నారు. ఆ కార్డు నుంచి కొడుకు, కోడలిని తొలగించాలంటే కోడలు రిలేషన్ దగ్గర ఎన్‌ఏ అని చూపిస్తోంది. వారి రిలేషన్ చూపడం లేదు. దీంతో వారి డిలీషన్ కూడా కుదరని పరిస్థితి.

☛ వివాహమైన వారు కొత్తగా రేషన్ కార్డు తీసుకునేందుకు.. వివాహ ధ్రువ పత్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. వివాహ నమోదు పత్రం నంబరు, ఫొటో ఇస్తేనే సర్వర్ తీసు కుంటోంది. దరఖాస్తు అప్‌లోడ్ అవుతోంది.


రెండు గంటలకో దరఖాస్తు

రేషన్ కార్డు కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే దాని స్థితిని తెలుసుకోడానికే రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలంటే కనీసం రెండు గంటలు పడుతోంది. ఉదయం 9 గంటలకే సచివాలయాల దగ్గర దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. గడువు తక్కువగా ఉండటం, ఈలోపే తమ దరఖాస్తు పూర్తిచేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పోటెత్తడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సర్వర్ మొరాయించకుండా చేయటం కానీ, గడువు పొడిగించటం వంటి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. సర్వర్ సమస్యతో రోజుకు కేవలం 7 నుంచి 10 దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేయగలుగుతున్నారు.



మహానాడులో జిల్లా నేతలకు కీలక బాధ్యతలు

- ఆర్థిక వనరుల కమిటీలో ఎంపీ లావు
- జన సమీకరణ కమిటీలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, భాష్యం
- రక్తదానం, వైద్య శిబిరం కమిటీలో డాక్టర్ చదలవాడ
- నేడు పల్నాడు జిల్లా మహానాడు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా మహానాడు నిర్వహించనున్నారు. మహానాడుకు సంబంధించిన పలు కమిటీలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం ప్రకటించారు. మహానాడు నిర్వహణలో జిల్లా నేతలకు కీలక బాధ్యతలు అప్పగించారు. పలు కమిటీల్లో ఎంపీ, ఎమ్మెల్యేలను నియమించారు.

మహానాడు కమిటీల్లో జిల్లా నేతలకు చోటు

మహానాడు ఆర్థిక వనరుల కమిటీలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను సభ్యుడిగా పార్టీ నియమించింది. అత్యంత కీలకమైన జన సమీ కరణ కమిటీలో వినుకొండ ఎమ్మెల్యే చీఫ్‌విప్ జీవీ ఆంజేయులు, చిలకలూ రిపేట, పెదకూరపాడు ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్‌లను సభ్యులుగా నియమించారు. మహానాడులో నిర్వహించే రక్తదాన.. వైద్య శిబిరం కమిటీలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును సభ్యు డిని చేశారు. సదరు నేతలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. జిల్లా నుంచి కడప మహనా డుకు పార్టీ శ్రేణులు తరలి వెళ్లేందుకు ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు జిల్లా మహానాడు..

నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులను పూర్తిచేసుకొని బుధవారం నరసరావుపేటలో జిల్లా మహానాడును నిర్వహించనున్నారు. ఇందుకు స్థానిక ప్రకాష్ నగర్‌లోని భువన చంద్ర టౌన్‌హాల్‌లో పార్టీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీజీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో వేగంగా పూర్తి చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, నామినేటెడ్ పదవుల నేతలు, పార్టీ అనుబంధ కమిటీల నాయకులు హాజరుకానున్నారు. జిల్లాలోని సమస్యలు, ప్రగతిపై మహానాడులో చర్చించి తీర్మానాలు చేయనున్నారు. వీటిని రాష్ట్ర మహానాడు నివేదికలో పొందుపరచనున్నారు.

కార్యకర్తలే టీడీపీకి అండ

పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

సత్తెనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అండ అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు మినీ మహానాడు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు తాత జయప్రకాష్ నారాయణ అధ్యక్షత వహించారు. మినీ మహానాడులో పాల్గొన్న కొమ్మాలపాటి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు అన్ని విధాలా పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. టీడీపీ ఆవిర్భవించి 43 సంవత్సరాలైందని, అందులో 23 సంవత్సరాలు అధికారంలో ఉన్నామంటే దాని వెనుక కార్యకర్తల కృషి ఎనలేనిదన్నారు. సూపర్ - 6 హామీలను మహానాడు తర్వాత అమలు చేయడం జరుగుతుం దన్నారు. నియోజకవర్గంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు రహదారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సత్తెనపల్లి - అచ్చంపేట మార్గంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. తీవ్రవాదుల దాడుల్లో మరణించిన కుటుంబాలకు, యుద్ధంలో అసువులుబాసిన సైనిక కుటుంబాలకు పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించి 12 తీర్మాలను మినీ మహానాడులో ప్రవేశ పెట్టగా... ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు కొమ్మాలపాటి, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని పలువురు టీడీపీ సీనియర్ నేతలను కొమ్మాలపాటి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరి, భీమినేని వందనాదేవి, పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, పూజల వెంకట కోటయ్య, దరువూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

అన్ని విధాల అండగా ఉంటాం

- ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి
- వేడుకగా చిలకలూరిపేట మినీ మహానాడు

చిలకలూరిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కూటమి పార్టీల శ్రేణులు ఎంతో ఐక్యంగా మెలిగి ఎన్డీయేకు అఖండ విజయాన్ని చేకూర్చారని, కార్యకర్తలందరికీ అన్ని విధాల అండగా ఉంటామని నరసరా వుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో జరిగిన చిలకలూరిపేట మినీ మహానాడు కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమన్వయంతో వ్యవహరించి పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని కోరారు. చిలకలూరిపేట మున్సిపాలిటీకి సంబంధించి నిధుల గోల్‌మాల్ కేసును ప్రస్తావిస్తూ.. మునిసిపాలిటీలో జరిగిన అన్ని అవకతవకలపై విజిలెన్స్ విచా రణ కోరాలని ఆయన వేదికపై ఉన్న మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీని కోరారు.

సంఘటితంగా ముందుకెళ్దాం..

స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సంఘటితంగా ఉండి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పార్టీకి అండగా ఉంటున్న వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ డంఖా మోగిద్దామని పిలుపునిచ్చారు. చిలకలూరిపేటలో తెలుగుదేశమే.. శాశ్వతంగా విజయం సాధించేలా కృషి చేద్దామని కోరారు. పార్టీ శ్రేణులపై ఈగ వాలితే ఊరుకోనని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న కృషిని గుర్తించి.. అందుకు అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకువెళ్దామన్నారు. అన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, నియోజకవర్గ పరిశీలకురాలు డి.ఉషారాణి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, జీడీసీసీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ఎమ్మెల్యేలు పుల్లారావు, అరవిందబాబు

గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07193 చర్లపల్లి - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో(ప్రతీ శనివారం) రాత్రి 11.10కి బయలుదేరి ఆదివారం వేకువజామునకు ముందు 2.18కి నడికుడి, 3.43కి పిడుగురాళ్ల, 4.33కి సత్తెనపల్లి, 5.30కి గుంటూరు, సోమవారం ఉదయం 7.10కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07194 కొల్లం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో(సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి మంగళవారం ఉదయం 10.40కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, 11.53కి పిడుగురాళ్ల, 12.18కి నడికుడి, సాయంత్రం 3.55కి సికింద్రాబాద్, 5.30కి హైదరాబాద్ చేరుకొంటుందన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో స్పోర్ట్స్ కోటా అడ్మిషన్లు ప్రారంభం



మంగళగిరి సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను స్పోర్ట్స్ కోటా కింద అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీటెక్‌తో పాటు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లోనూ అడ్మిషన్లు జరుగుతున్నాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు యాజమాన్యం స్పోర్ట్స్ కోటాలో ప్రవేశాలను కల్పిస్తోంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నూరు శాతం స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.శివశంకర్, స్పోర్ట్స్ డైరెక్టర్ అనూప్‌సింగ్ సూర్యవంశీ స్పోర్ట్స్ కోటా అడ్మిషన్ల వివరాలను వెల్లడించారు. బీటెక్‌లో చేరదలిచిన విద్యార్థులకు టెన్త్, ఇంటర్‌లో 50 శాతం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో చేరే విద్యార్థులకు 45 శాతం ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఒలింపిక్ గేమ్స్, వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా, సౌత్ ఆసియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న వారు నేరుగా అడ్మిషన్ పొందేందుకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు స్పోర్ట్స్ ట్రయల్స్ నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి జూన్ 18 వరకు స్పోర్ట్స్ ట్రయల్స్ ఉంటాయన్నారు. డిగ్రీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి నంబరు 70365 89973 సంప్రదించాలని సూచించారు.

అత్యాచార బాధితులకు.. భరోసా ఏదీ..?

వైసీపీ హయాంలో మూడు జిల్లాల్లో కలిపి 55 కేసులు

ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించింది ఐదుగురికే

చర్యల కోసం కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (పీవోఏ) చట్టం కింద నమోదైన హత్య కేసుల్లో బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరగడం లేదు. ఈ చట్టం ప్రకారం హత్యకు గురైన వ్యక్తి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2019-2024 మధ్యన నమోదైన కేసులను పెండింగ్‌లో పెట్టడం వలన ఇప్పుడు బాధితులు నిత్యం కలెక్టరేట్ల చుటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నా ఎస్సీలు.. నా ఎస్టీలు అంటూ అధికారంలో ఉండగా బీరాలు పలికిన ఆ పార్టీ నేతలు బాధిత కుటుంబాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు వారందరికి న్యాయం చేయాల్సిన బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడింది. అయితే తగిన ఖాళీలు లేకపోవడం, పోలీసు శాఖ నుంచి పూర్తిస్థాయి సమాచారం రాకపోవడం తదితర కారణాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ కేసులు ఎక్కువ సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై ప్రభుత్వస్థాయిలో సమీక్ష నిర్వహించి బాధితులకు తగిన న్యాయం వేగవంతంగా చేయాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అత్యాచారణ నిరోధక చట్టం కింద వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 32 హత్యలు జరిగితే బాధితుల కుటుంబాల్లో కేవలం ముగ్గురికే ఉద్యోగం కల్పించారు. పల్నాడు జిల్లాలో 18 హత్యలు జరిగాయి. ఈ జిల్లాలో కేవలం ఇద్దరికే ఉద్యోగం ఇచ్చారు. బాపట్ల జిల్లాలో ఐదుగురు ఎస్సీ/ఎస్టీలు హత్యకు గురవగా, ఒక్కరికి కూడా ఇప్పటివరకు ఉద్యోగం కల్పించలేదు. దీని వలన బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రతీ సోమవారం కారుణ్య నియామకాలకు సంబంధించి నియామక ఉత్తర్వులను కలెక్టరేట్ అధికారులు ఇస్తున్నారు. అయితే పీవోఏ కేసులపై శ్రద్ధ వహించడం లేదు. మూడు జిల్లాలో కలిపి ఇంకా 50 మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నది. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరిగిన ప్రతీసారి దళిత, గిరిజన సంఘాల ప్రతినిధులు దీనిపై అధికారులను నిలదీస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఉండటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్థికసాయంగా గుంటూరు జిల్లాకు రూ. 1.80 కోట్లు విడుదలైతే రూ. 96 లక్షలు ఖర్చు పెట్టారు. రూ. 83 లక్షలు ఖర్చు చేయలేకపోయారు. పల్నాడు జిల్లాకు రూ. 1.05 కోట్లు మంజూరైతే రూ. 1.04 కోట్లు ఖర్చు చేశారు. బాపట్ల జిల్లాకు రూ. 1.36 కోట్లు మంజూరైతే రూ. 1.22 కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థికసాయం అందించడంలో కలెక్టర్లు దృష్టి పెట్టి జిల్లాలకు విడుదలైన నగదుని పంపిణీ చేయాలని, తద్వారా అదనపు నిధులకు ఇండెంట్ పెట్టుకోవాలని ప్రభుత్వం సూచించింది.

9 నెలల పాటు నిడమర్రు-కాజా ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ), అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిమిత్తం నిడమర్రు - కాజా మధ్యన ఉన్న లెవల్ క్రాసింగ్ గేటు నంబరు. 10ని మూసేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నెలల పాటు ఈ గేటు మూసి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో చినకాకాని నుంచి నిడమర్రు వెళ్లే పాదచారలు, వాహనదారులు హేయ్‌ల్యాండ్ గేటు(ఎల్‌సీ నంబరు. 11) ద్వారా ప్రయాణించాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



జాన్‌సైదాకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఆర్డీవో మధులత

యడ్లపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి పిడుగుపాటుకు గురైమృతి చెందిన మండలంలోని కారుచోలకు చెందిన షేక్ పర్వీన్(34) కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వం తరపున ఆదుకున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును నరసరావుపేట ఆర్డీవో మధులత సమక్షంలో పర్వీన్ భర్త జాన్ సైదాకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగిలిన ఆర్థిక సాయాన్ని కూడా త్వరలో అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ విజయశ్రీ, టీడీపీ నాయకులు ఉన్నారు.

బ్యాంకర్లు ఉదారంగా రుణాలు ఇవ్వాలి

◆ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా లోని బ్యాంకు అధికారులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కర్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జనవరి త్రైమాసికానికి డి.సి.సి (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ), డి.ఎల్.ఆర్.సి (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ)పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని లబ్దిదారులకు సులభంగా పథకాలపై అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. జనవరి - మార్చి త్రైమాసికానికి జిల్లాలోని 310 బ్యాంకులలో సుమారుగా రూ. రూ.41,995.38 కోట్లు వ్యాపారం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజరు రాం ప్రసాద్ తెలిపారు. ప్రధాన మంత్రి జన ధన యోజన కింద 5,31,755 మందికి రూపే కార్డులు, వార్షిక క్రెడిట్ ప్లాన్ కింద రూ.22,910.84 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. కౌలు రైతులు 3,388 మందికి రూ.23.89 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. త్రైమాసిక నివేదికను పి.పి.టి ద్వారా వివరించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ టి.మాధురి సమావేశం ప్రాముఖ్యతను వివరించారు. ఆర్.బి.ఐ అధికారి అబిషేక్ రాజ్, నాబార్డు డి.డి.ఎం సి.శరత్ బాబు, వివిధ బ్యాంకుల కో- ఆర్డినేటర్లు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

23 నుంచి ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిబిరం



మాట్లాడుతున్న గని, చంద్రనాయక్ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు, మల్లయ్య లింగం భవన్‌లో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ తెలిపారు. మంగళవారం గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కళాకారులకు కొత్త కళారూపాలు, పాటల శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో తయారుచేసిన పాటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కళాకారులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుర్తింపు కార్డులు, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొన్నారు.

మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా ఆనందబాబు



వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియమితులయ్యారు. 22 మందితో కూడిన కమిటీలో ఆయనకు స్థానం లభించడం పట్ల వేమూరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి



కెరీర్ గైడెన్స్‌వర్క్‌షాపునకు హాజరైన విద్యార్థులు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) మే 20 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సంగం డెయిరి మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్ అన్నారు. సంగం డెయిరి ఉద్యోగుల పిల్లలు, భవిష్యత్, విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై మంగళవారం కెరీర్ గైడెన్స్ వర్క్ షాపు సంగం డెయిరి ఆధ్వర్యంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగింది. ముంబయికి చెందిన మౌంటోరియా సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో లభించే ఉపాధి అవకాశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో 21 ఏళ్లలోపు ఉన్న 200 మంది సంగం డెయిరీ ఉద్యోగుల పిల్లలు పాల్గొన్నారు. డెయిరీ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేలైను భూములకు ఫెగ్ మార్కు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో రైల్వే లైను ఏర్పాటుకు సంబంధించి భూములను నిర్ధారించేందుకు రైల్వే, రెవెన్యూ అధికారులు ఫెగ్ మార్కు ఏర్పాటు చేయనున్నారు. ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా వర్షం కారణంగా బుధవారానికి వాయిదా వేశారు.

ఆకట్టుకుంటున్న నాటిక పోటీలు



కిడ్నాప్ నాటికలోని సన్నివేశం

వినుకొండటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నాటిక పోటీలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2వ రోజు మంగళవారం యువభేరి థియేటర్స్ హైద రాబాద్ వారి నా శత్రువు, సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికల్లోని పలు సన్నివేశాలు అలరించాయి. మహిళా ప్రేక్షకులను నిర్వాహకులు వివిధ కూపన్ల ద్వారా ఎంపిక చేసి, రూ.2 వేలు విలువ చేసే చీరలను బహూకరించారు. దాతలతో పాటు వేదికకు ముప్పాళ్ల చెన్నయ్య, రాపర్ల శ్రీనివాసరావు పేరుతో నాటిక పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు ముత్తినేని గిరి, బొల్లా వెంకట కోటయ్య, ప్రముఖ న్యాయవాది రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

బొల్లాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి పొలాల్లోకి రావడంతో కుక్కలు వెంబడించి దాడిచేశాయి. స్థానిక రైతులు చూసి వాటిని చెదరగొట్టినప్పటికీ అప్పటికే దుప్పి మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి దుప్పి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం దహనం చేశారు.



భక్తుల భద్రతే మా బాధ్యత : పల్నాడు జిల్లా ఎస్పీ



ప్రార్థన మందిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 20, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుండి జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, లోకల్ పోలీసులు పాల్గొన్నారు.జిల్లాలో ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. దేవాలయాలలో ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వివరాలు తెలుసుకుని, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయ అధికారులకు తగు సూచనలు చేశారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భక్తుల భద్రతను దృష్టి లో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగి ఉండే అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

ఆశ పెట్టుబడి పెట్టి రూ.19 లక్షలు కొట్టేశారు

గుంటూరు నగరంపాలెంస్టేషన్లో సైబర్ క్రైం కేసు నమోదు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : 'మీ పెట్టుబడికి మాది గ్యారంటీ.. రూపాయికి అర్ధ రూపాయి లాభం ఇస్తామం.' అంటూ ఆశ కల్పించారు.. ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టించి, రూ.16 వేలు వెనక్కి ఇచ్చి వారిలో మరింత ఆశ, నమ్మకాన్ని కలిగించారు. దీంతో నిజమేనా అని నమ్మిన బాధితుడు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి ఘోరంగా మోసపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మెడికల్ కళాశాల సమీపంలోని రైల్వే క్వార్టర్స్ లో నివాసం ఉండే శృంగారపాటి అభిరామ్ డయాలసిస్ సర్వీస్ కంపెనీలో పని చేస్తుంటాడు. తన మొబైల్‌కు గత మార్చి 7న కొన్ని మెసేజ్ లు వచ్చాయి. దాని ఆధారంగా టెలిగ్రామ్ గ్రూపులో అభిరామ్‌ను చేర్చుకున్నారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయంటూ ఆశ కల్పించారు. మొదట్లో కొద్ది లాభంతో.. ఆశపడిన అభిరామ్‌కు రూ.లక్ష పెట్టుబడి పెడితే లక్ష ఇరవై వేలు రూపాయలు ఇస్తామని చెప్పారు. నిజమేనని నమ్మిన అభిరాం తొలత లక్ష రూపాయలతో పాటు దఫాల వారీగా పెంచుకుంటూ పోయాడు చివరకు రూ.19,21,491లు పెట్టుబడిగా పెట్టించారు. తనకు రావాల్సిన మొత్తం ఇవ్వాలని అడగ్గా, మరో ఏడున్నర లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాలని కోరారు. లేదంటే కనీసం రూ.నాలుగున్నర లక్షలైనా పెట్టండి అని ఒత్తిడి చేశారు. అయితే అనుమానం వచ్చిన అభిరామ్ తన డబ్బు తనకి ఇస్తే తర్వాత పెట్టుబడి పెడతానని చెప్పాడు. అయితే వారు డబ్బు ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించి 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ కేటుగాళ్ల ఖాతాలో ఉన్న రూ.86,361 నగదును బ్యాంకు అధికారులు హోల్డ్ చేశారు. ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

మాస్టార్లకు గ్రీన్ సిగ్నల్

● ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు.. ● ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు సఫలం

● నేడు విడుదల కానున్న నోటిఫికేషన్

గుంటూరు(విద్య) మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో అధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల సమాచారం నేపథ్యంలో.. ఇప్పటికే వివిధ గ్రేడ్లలో బదిలీలు, ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులకు విద్యాశాఖ సమాచారం చేరవేసింది. సిద్ధంగా ఉండాలని అందుకు అవసరమైన ప్రాథమిక సమాచారం సేకరించుకోవాలని సూచించారు.

ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు సేకరించి నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు కేటగిరిలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 2 వేల మందికి పైగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలు కావాల్సి ఉంది. మరో రెండు వేల మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

షెడ్యూలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు షెడ్యూలు ప్రకారం జరుగుతాయని అధికారులు వెల్లడించారు. తొలుత ప్రధానోపాధ్యాయులు, ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్స్‌కు నిర్వహిస్తారు. చివరిలో ఎస్‌జీటీలకు బదిలీల ప్రక్రియ కొనసాగిస్తారు. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు 4 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదల కాగానే ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో విద్యాశాఖ నిర్దేశించిన విధంగా వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తారు. తర్వాత ప్రత్యేక సాఫ్ట్వేర్ ద్వారా బదిలీలకు సంబంధించిన కార్యక్రమం ప్రారంభమవుతుంది. తర్వాత ఉపాధ్యాయులు ఆప్షన్స్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఇప్పటికే జారీ చేసింది.

సిద్ధంగా ఉన్నాం: డీఈఓ

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి సమస్త సమాచారంతో సిద్ధంగా ఉన్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం రాత్రి తెలిపారు. ఇప్పటికే పూర్తి వివరాలను ఉపాధ్యాయులకు వివరించామని నిర్దేశించిన షెడ్యూల్‌ను నిబంధనల ప్రకారం అమలు చేస్తూ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల సహకారంతో సమర్థంగా పూర్తి చేస్తామని ఆమె చెప్పారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్

దాచేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని విజయ భాస్కర కల్యాణ మండపంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్ జరిగింది. సీజీఆర్ఎఫ్ కంజ్యూమర్స్ గ్రీవెన్సెస్ రెడ్ సెల్ఫాం చైర్పర్సన్, మాజీ జిల్లా జడ్జి, విక్టర్ ఇమ్మానియేలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యుత్ బిల్లుల హెచ్చు తగ్గులు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సమావేశంలో 10 అర్జీలు వచ్చాయి. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి పల్నాడు ఎస్ఈ పీ విజయకుమార్, ఎస్ఏవో బీ వెంకటేశ్వరరావు, ఎస్ శ్రీనివాసరావు, ఆర్సీహెచ్ఐ శ్రీనివాసరావు, ఎల్ సునీత, ఏడీఈ పీ వీరేశ్వరరావు, పీ సందీప్ కుమార్, ఏవోలు హాజరయ్యారు.

వృద్ధుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరుబయట స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న ఆరేళ్ల గిరిజన బాలికను 65 యేళ్ల వృద్ధుడు చాక్లెట్ కొనిపిస్తానని మాయమాటలు చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్ 1వ లైన్లో గల మద్దిరాలమ్మ దేవాలయం వద్ద ప్రతి రోజూ చిన్నారులు ఆడుకుంటుంటారు. అదే సమయంలో అక్కడే ఓ 65 యేళ్ల వృద్ధుడు నిత్యం కూర్చుంటూ బాలికలకు చాక్లెట్లు కొనుక్కోమని డబ్బులిస్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా పిల్లలు ఆడుకుంటుండగా ఆరేళ్ల బాలికను చాక్లెట్ కొనుక్కునేందుకు డబ్బులిస్తానని మాయమాటలు చెప్పి కారు పార్కింగ్ ప్రదేశంలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన తోటి బాలికలు సదరు బాలిక తండ్రికి జరిగిన విషయం చెప్పారు. బాలిక తండ్రి వచ్చి వృద్ధుడిని ప్రశ్నించగా ఘర్షణ జరిగింది. బాలిక తండ్రి, మేనల్లుడిపై వృద్ధుడి కుమారుడు కృష్ణ, అతని బావమరిది దాడి చేశారు. దీనిపై బాలిక తండ్రి పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. వృద్ధుడిపై పోక్సో, గిరిజన బాలిక కావడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు యోగాంధ్ర లాంచింగ్

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి) ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బుధవారం ఉదయం ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద యోగాంధ్ర లాంచింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పార్వతి తెలిపారు. కార్యక్రమంలో మండలపరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు యోగా క్యాంపెయిన్

పిడుగురాళ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర క్యాంపెయిన్ -2025లో భాగంగా పిడుగురాళ్ల పట్టణం నందు నేడు సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. స్థానిక వాసవీ కల్యాణమండపం నందు జరిగే యోగాంధ్ర క్యాంపెయిన్ ప్రారంభోత్సవానికి పట్టణ ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు హాజరుకావాలని కమిషనర్ కోరారు.

మాడుగుల వాసిగా మృతుడి గుర్తింపు

రెంటచింతల, మే 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య అనే శీర్షికన ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు కుటుంబీకులు స్పందించారు. గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన నందికొం డ చిన యాగయ్య(42) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 15న ఇంటి నుంచి వచ్చి పాలువాయి జంక్షన్లోని నర్సరీలో పురుగు మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి ఉంది. తండ్రి సుబ్రహ్మణ్యం గురజాలలోని ఓ బార్బర్ షాపులో పనిచేస్తుంటాడు. గురజాల మార్చురీలోని మృతదేహాన్ని మంగళవారం కుటుంబీకులు తీసుకెళ్లినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

రెంటచింతల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలి గ్రామంలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,190లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

26న నాణ్యమైన ఎరువుల వేలం

క్రోసూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న ఉదయం 11 గంటలకు క్రోసూరులోని ఏడీఏ కార్యాలయం వద్ద నాణ్యమైన ఎరువులను వేలం వేయనున్నట్టు ఏడీఏ వీ హనుమంతరావు మంగళవారం తెలిపారు. యూరియా, కాంప్లెక్స్ రసాయానిక ఎరువుల మొత్తం 61 కిలోల ఆరు వందల గ్రాములు వేలానికి సిద్ధం చేసినట్టు ఆయన తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



లక్షమల్లెలార్చనలో పాల్గొన్న భక్తులు

రెంటచింతల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆలయాల ప్రాశస్త్యానికి భక్తుల నమ్మకానికి గుర్తుగా నిలిచే వార్షికోత్సవాలను పురస్కరించుకుని రెంటచింతలలోని శివాలయం (మల్లేశ్వరస్వామి ఆలయం) 29వ వార్షిక వేడుకలు శివపార్వతుల కల్యాణం రమణీయంగా జరిగింది. పూజారి శర్మ నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, లక్షమల్లెలార్చన, శాంతి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక కంఠస్థ పఠనంలో బంగారు పతకాన్ని సాధించిన అమరినేని రమాదేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి, ఈవో రామిరెడ్డి, ఎంపీడీవో కె.సరోజనిదేవి, గుండా రామ్మూర్తి, అమిరినేని శ్రీనివాసరావు, సైదులు, ఏచూరి నరసింహారావు, సైదారెడ్డి, కేధార్నాధ్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

కూలీలుగా.. భూములిచ్చిన రైతులు

- పాతికేళ్లు గడిచినా ఫ్యాక్టరీ నిర్మాణాలు లేవు
- నాడు రూ.లక్ష.. నేడు రూ.25 లక్షలు
- బీడు భూములుగా పంట పొలాలు

పది మందికి పని చూపించి నలుగురికి పట్టెడు అన్నం పెట్టే రైతన్నను మీ పొలాలు మాకివ్వండి, మీ పిల్లలకు ఉద్యోగాలు ఇస్తాం. మీ గ్రామాలు మాకు అప్పజెప్పండి, అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం. మీ పాఠశాలలు మాకు ఇవ్వండి ఆదర్శ పాఠశాలలుగా మారుస్తాం. వైద్యం కావాలంటే దూర ప్రాంతాలకు వెళ్ళక్కర్లేదు. తాగునీటి కోసం ప్రభుత్వాన్ని అడగక్కర్లేవు. రోడ్లు కావాలంటే మేమే వేసి చూపిస్తాం.. అంటూ భూములు కొనుగోలు చేసే సమయంలో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించారు.



పంట పొలాల్లో పెరిగిన సర్కార్ తుమ్మచెట్లు



అలుగుమల్లిపాడు గ్రామ ఏరియల్ వ్యూ

దాచేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఉద్యోగాలు, మరో వైపు సంక్షేమం, అభివృద్ధి, ఇంకో వైపు తమ పొలాలు పారిశ్రామిక వాడలుగా మారిపోతున్నాయంటూ ఎన్నో కలలు గన్న రైతులు తమకు అన్నం పెట్టే పొలాలను ఫ్యాక్టరీ యాజమాన్యాలకు కేవలం లక్ష రూపాయలకు ఎకరం చొప్పున భూమిని అమ్మేశారు. 2000లో జరిగిన ఈ అమ్మకాలు పూర్తి చేసుకొని నేటికి 25 వసంతాలు కావచ్చింది. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం, ఉద్యోగాల కోసం ఎదురు చూసిన నాటి యువత నేడు వృద్ధాప్య పింఛన్కు దరఖాస్తు చేసుకొనే దుస్థితికి చేరుకున్నారు. అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తుంది. ఇదంతా వెనుకబడిన ప్రాంతంగా పిలిచే పల్నాడు జిల్లా దాచేపల్లి, గురజాల, కారంపూడి మండలాల్లోని తొమ్మిది గ్రామాల రైతులు అవస్థలు పడుతున్నారు. 2000 ఫిబ్రవరి 9న అంబుజా సిమెంట్ యాజమాన్యం (ప్రస్తుతం ఈ భూములు అదాని గ్రూపులో చేరాయి) ఆయా మండలాల్లోని అలుగుమల్లెపాడు, గోదవాడ, గోగులపాడు, కాసారం, అంబాపురం, నడికూడి, తక్కెళ్లపాడు, ఇనుపరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. వీరంతా రెండు వేల ఎకరాలను విక్రయిస్తే ప్రభుత్వ పోరంబోకు భూమి మరో వెయ్యి ఎకరాలు అంబుజా యాజమాన్యానికి అప్పజెప్పింది. మూడు వేల ఎకరాల్లో ఉన్న భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆయా భూముల్లో పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసేవారు. ఆ పంటల ఉత్పత్తి తగ్గి పోవటం, కూలీలకు పనులు లేకుండా పోయింది. ఆయా గ్రామాల్లో నేడు జీవనం లేక చాలా మంది ప్రజలు హైదరాబాద్, గుంటూరు, ఖమ్మం, నెల్లూరు వంటి దూర ప్రాంతాలకు తరలివెళ్ళి జీవనం సాగిస్తున్నారు. మరి కొంత మంది దగ్గరలో ఉన్న సిమెంట్ కర్మాగారాలు, ముగ్గు మిల్లుల్లో కార్మికులుగా జీవిస్తున్నారు.

మా భూములు మేమే సాగు చేసుకుంటాం

ఫ్యాక్టరీ యాజమాన్యాలకు భూములిచ్చిన రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేంత వరకు తమ భూములు తామే సాగు చేసుకుంటామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మాచవరం మండలం సరస్వతి భూముల్లో రైతులు తమ భూములను సాగు చేసుకొనేందుకు పోరాటం చేస్తున్నారు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో తమ భూములను సాగు చేసుకోవటం లేదా తమకు ఆర్థికంగా ఉపాధి చూపించాలని కోరుతున్నారు. ఇందు కోసం పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు తమ న్యాయమైన డిమాండ్లను సాధంచుకునేందుకు ఉద్యమిస్తామంటున్నారు.

ఫ్యాక్టరీనైనా నిర్మించండి.. భూములైనా ఇవ్వండి

- నూకన చిన బిక్షాలు, రైతు



ఫ్యాకర్టీ నిర్మిస్తామంటే భూములిచ్చాం. పంట భూములను బీడు భూములుగా మారుస్తామంటే మాత్రం తాము ఒప్పుకోం. మాకు అన్యాయం చేశారు.

గుమస్తాలుగా జీవనం సాగిస్తున్నాం

- నూకన కొండయ్య, రైతు



పంట పొలాలు సాగు చేసుకొని రైతులుగా జీవనం సాగించే మేము నేడు భూములు కోల్పోయి దుకాణాల్లో గుమస్తాలుగా జీవనం సాగిస్తున్నాం. యాజమాన్యాలు ఫ్యాక్టరీ నిర్మాణాలు చేపట్టక పోవటంతో గుమాస్తాలుగా, గుళ్ళ క్వారీ కార్మికులుగా వంటి చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకు బండిని లాగిస్తున్నాం.

వెయిట్ లిఫ్టర్ నీలంరాజుకు ఎమ్మెల్యే జూలకంటి ఆర్థికసాయం



వెయిట్ లిఫ్టర్ నీలంరాజుకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): వేదిక స్వదేశమైనా, విదేశమైనా క్రీడా పోటీల్లో దూసుకుపోవాలని మాచర్ల నియోజకవర్గ క్రీడాకారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. మంగళవారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ కొమెర నీలంరాజుకు రూ.1,61,660 నగదును అంద జేశారు. అనంతరం క్రీడాకారులు వెయిట్ లిఫ్టర్స్ సాధించిన పతకాలను ఎమ్మెల్యే జూలకంటికి చూపించగా వారిని అభినందించారు. ఈ ఏడాది జనవరి 31న ఉత్తరాఖండ్లో 67 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో నీలంరాజు గోల్డ్మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకేశవ యాదవ్, వెయిట్ లిఫ్టర్స్ మంజుల అశోక్, కందుకూరి హైమావతి, అప్పల మల్లికార్జునరావు, రాకేష్ రణధీర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ శ్రీరామరక్ష

ఆపదలో ఉన్న వారికి శ్రీరామ రక్షలా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపకరిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మాచర్ల నియోజకవర్గ పరిధిలో 34 మంది లబ్దిదారులకు రూ.39,93,320 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన పల్లవి, కార్తీక్



కత్తి పల్లవి, కార్తీక్

గురజాలటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణానికి చెందిన కత్తి పల్లవి 43 కేజీలు, కత్తి కార్తీక్ 53 కేజీల సబ్ జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని డీఆర్పి ఆనంద్ స్టేడియంలో ఈనెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 22.29 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతుందని తెలిపారు.

అధికారుల పని తీరు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ఎంపీపీ సునీతా సాయిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాశంకర్

దుర్గి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిలో అధికారుల పని తీరు ప్రజలకు పారదర్శకంగా ఉండాలని ఎంపీపీ యేచూరి సునీతాశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. తాగునీటికి అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ఏయే శాఖల్లో ఎన్ని పనులు జరిగాయో, ఇంకా ఏయే పనులు జరుగుతున్నాయో సమాచారం అందించడం లేదన్నారు. ఏయే పనులకు ఎంత నిధులు మంజూరయ్యాయో తమ దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడా పారదర్శకత కనిపించడం లేదన్నారు. మనమంతా సమైక్యంగా ఉండి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం మల్లికార్జునరావు, ఏవో అమ్మిరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోపాల్సింగ్, పీఆర్ ఏఈ హనుమంతురావు, హౌసింగ్ ఏఈ ఎస్తేర్ రాణి, విద్యుత్ ఏఈ శ్రీశైలం, ఎంఈవో బెంజిమెన్, ఏపీఎం పీవీ రంగారెడ్డి, పీహెచ్సీ వైద్యులు పెదసైదులు, దిలీప్, అంగన్వాడీ సూపర్వైజర్ నాగేంద్రంలు తమ శాఖ పనితీరును వివరించారు. జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద వివిధ శాఖల పనితీరుపై పలు సూచనలు చేశారు. ఓబులేశునిపల్లె హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో ర్యాంకులు సాధినందుకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్, సత్యప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోల పోరుబాట

- తహసీల్దార్కు వినతిపత్రం అందజేత

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) పోరుబాట పట్టారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ కారణంగా పెరిగిన పనిభారాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వీఆర్వోలు దశల వారీ ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా మాచర్లలోని తహసీల్దార్ బందెల కిరణ్కుమార్ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబరు 4 ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్తో తమపై పనిభారం పడుతుందని వీఆర్వోలు పేర్కొన్నారు. రేషనలైజేషన్లో మిగిలిపోయిన గ్రామ, రెవెన్యూ అధికారులకు నిర్దిష్టమైన విధి విధానాలతో జీవో జారీ చేయాలని, గ్రామ, రెవెన్యూ అధికారులను సచివాలయం నుంచి తప్పించి 2019కు పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో తహసీల్దార్ ఆధ్వర్యాన విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీఆర్వోల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆరుమళ్ల నాగేశ్వరరావు, మాచర్ల మండల అధ్యక్షుడు చిరంజీవినాయక్, మండల కార్యదర్శి అనిల్కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖాజావలి, అంజి భాస్కర్, చంద్ర, మంగమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల్లో మట్టి నమూనాల సేకరణే ప్రధానం

క్రోసూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలు వేసుకోవటానికి ముందు భూమి ఆరోగ్యాన్ని తెలుసుకోవటం అత్యంత ముఖ్యమైన అంశమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సిబ్బంది భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐతే భూసార పరీక్షలు చేయటానికి మట్టి నమూనాల సేకరణే ప్రధానాంశంగా చెపుతున్నారు. మట్టి నమూనాల సేకరణకు రైతులు పాటించాల్సిన మెళకువల గురించి అధికారులు అవగాహన కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. సరైన పద్ధతిలో తీసిన మట్టి నమూనాల నుంచి వచ్చే ఫలితాలు యదార్థంగాను, లాభదాయకంగాను ఉంటాయని అధికారులు వెల్లడించారు. మట్టి నమూనాలు తీసే విధానం గురించి మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ప్రయోగాత్మకంగా అధికారులు ప్రదర్శన ద్వారా చూపించారు. రైతులు భూసార పరీక్షలకు తీసుకు వచ్చే మట్టి నమూనా కచ్చితమైన పద్ధతిలో సేకరిస్తే రైతులకు అధిక మేలు జరుగుతుంది. నేలలో పోషకాల పరిణామ పరంగా ఉండే అవకాశాలను భూసార పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంట ఆరోగ్యాన్ని తెలుసుకొని ఏ పంట వేయాలో నిర్ణయించుకొనే అవకాశం ఉంటుంది. మట్టి నమూనాలను సరైన పద్ధతిలో సేకరించి రైతు సేవా కేంద్రాల్లో అందజేయాల్సి ఉంటుంది.

చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల నిరసన

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): చట్టాల రద్దును వ్యతిరేకిస్తూ మంగళవారం సీటీయూ, సీఐటీయూ, ఎంసీపీఐ కార్మిక సంఘాల ఆధ్వర్యాన పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబరు కోడ్లను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత అబ్రహం లింకన్, ఎంసీపీఐ నేత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): సీపీఐ నిర్వహించే ప్రజా పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శిగా సెగ్గం వెంకటేశ్వరరావు, సభ్యులుగా తల్లపల్లి పానయ్య, దొడ్డా రాజు, ఇజ్రాయేలు, శ్రీనివాసరెడ్డి, వీరరాఘవయ్యలను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

● క్రోసూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం క్రోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంజిమాల రవి బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు పంట వేయటానికి రైతులను ప్రోత్సహించిన ప్రభుత్వం, పొగాకు కంపెనీలు, ఉత్పత్తులు కొనటానికి ముందుకు రాక పోవటం శోచనీయమన్నారు. పొగాకు ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామి పథకం కూలీ రేట్లను పెంచాలని కోరుతూ తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో కౌలు రైతు సంఘం అధ్యక్షులు తిమ్మిశెట్టి హనుమంతరావు, జిల్లా నాయకులు ఆవుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు కుటుంబానికి టీడీపీ నేతల పరామర్శ

మాచర్ల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్కు చెందిన అంకాల కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం అతని కుటుంబాన్ని టీడీపీ నేతలు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండాల శ్రీనివాస్ యా దవ్, డాక్టర్ బసివిరెడ్డి, సత్తిబాబు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, నరసింహులు, తగుళ్ల కృష్ణ, బాలస్వామి, బుద్ధారెడ్డి, జగదీష్, శ్రీను, రామాంజినేయులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ వేత్త జాజికి సన్మానం



జాజిని సన్మానిస్తున్న ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు

కారంపూడి, మే 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ వేత్త, ఫారెస్ట్ మ్యాన్ కొమెర అంకారావు (జాజి)ని రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు పీ మల్లికార్జునరావు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ జాజి నల్లమల అడవి బిడ్డగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అడవులు, సామాజిక అడవులు, వన్య ప్రాణులు, ఔషధ వృక్షాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సేవకు జాజి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రకృతి సేవకు జాజి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే జాజికి రాష్ట్ర ప్రభుత్వం బయోడైవర్సిటీ అవార్డును ప్రకటించింది. ఈనెల 22వ తేదీన విజయవాడలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డును జాజి అందుకోనున్నారు.

రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

నకరికల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలనుకొనే గ్రామీణ ప్రాంత యువకులకు రిఫ్రిజిరేషన్ ఏసీ సర్వీసింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారికి 30 రోజుల ఉచిత హాస్టల్, భోజన వసతితో ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 8125397953, 9700687696 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మున్సిపల్ మంత్రితో ఎమ్మెల్యే యరపతినేని

- పట్టణాభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను మంగళవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాల్లో అభివృద్ధి గురించి నిధులు మంజూరు చేయాలని మంత్రి నారాయణను ఎమ్మెల్యే యరపతినేని కోరారు. ఇందుకు సానుకూలంగా మంత్రి నారాయణ స్పందించారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు యరపతినేని తెలిపారు. గురజాల మున్సిపాలిటీలో సుంకరకుంట చెరువు పూడికతీత, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, చుట్టూ లైటింగ్, సుందరీకరణకు రూ.2 కోట్లు, మాచర్ల -గుంటూరు రహదారికి ఇరువైలా మెయిన్ డ్రైన్, అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారన్నారు. అడగ్గానే రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు యరపతినేని మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా మహానాడును జయప్రదం చేయాలి

- పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



మినీ మహానాడులో టీడీపీ సీనియర్ నేత గోగులపాటి అంజయ్యను సన్మానించిన కొమ్మాలపాటి శ్రీధర్ తదితర టీడీపీ నేతలు

సత్తెనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని భువన చంద్ర టౌన్హాల్లో బుధవారం జరిగే పల్నాడు జిల్లా మహానాడుకు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరై జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం సత్తెనపల్లిలో జరిగిన మినీ మహానాడుకు హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా మహానాడుకు జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టి పాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతార న్నారు. పార్టీ నామినేటెడ్ పదవులు ఉన్న నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులంతా పల్నాడు జిల్లా మహానాడుకు హాజరై జయప్రదం చేయాలన్నారు.

రీసర్వేతో 20 సంవత్సరాల సమస్యకు పరిష్కారం

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): 20 సంవత్సరాల నుంచి భూమిని తమ పేరున ఎక్కించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికి పరిష్కారం కాని సమస్య గ్రామంలో జరిగిన రీసర్వేతో పరిష్కారమైంది. గ్రామానికి చెందిన మన్నవ భద్రయ్య, విజయలక్ష్మిలకు చెందిన 12.5ఎకరాల భూమి తమ బంధువుల పేరున ఉండటంతో దానిని తమ పేరున రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించాలని చెప్పులరిగేలా తిరిగినప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం భూ రీసర్వే ప్రారంభించిన తరువాత చావపాడులో రీసర్వే జరుగడంతో వారి భూమి వారి పేరుమీద ఎక్కించేందుకు రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను మంగళవారం తహసీల్దార్ డానియేలు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్లు భద్రయ్య కుటుంబానికి అందజేశారు. దీంతో వారు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్తెనపల్లి సబ్ జైలులో న్యాయమూర్తి తనిఖీ



సబ్ జైలులో నిత్యావసర వస్తువులను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జియా వుద్దీన్

సత్తెనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి జియా ఉద్దీన్ మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. సబ్జైలులోని పరిసరాలను పరిశీలించారు. సబ్ జైలులో ముద్దాయిలకు అందిస్తున్న ఆహార పదార్థాలను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం రికార్డులను కూడా తనిఖీ చేశారు. సబ్ జైల్లో ముద్దాయిలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాల గురించి, ఆహార పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. బెయిల్ వేసుకొనే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఆయనతో పాటు సబ్ జైలు అధికారి వెంకటరత్నం, న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీరు సుభానీ ఉన్నారు.

'అన్నదాత సుఖీభవ'కి విధి విధానాలను ప్రకటించాలి

- కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

నకరికల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించాలని కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. మంగళవారం చేజర్ల సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ తుమ్మలచెరువు నాగరాజుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మిర్చి రైతులకు క్వింటాల్ రూ.5వేలు చొప్పున బోనస్ చెల్లించాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి అన్నదాత సుఖీభవ పథకానికి ఒకేసారి రూ.20వేలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలని కోరారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరలను కల్పిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గాడిదమళ్ళ పిచ్చారావు, కోటేశ్వరరావు, ఎస్ రామ్జీ నాయక్, బీ సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్ష పదవి కమ్మ సామాజిక వర్గానికి కేటాయించాలి

నకరికల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్ష పదవిని నకరికల్లు మండలంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేతలు కోరుతున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేతలు నకరికల్లు టీడీపీ అధ్యక్ష పదవిని ఇప్పటి వరకు వివిధ సామాజిక వర్గాలకు కేటాయిస్తూ వచ్చారని తెలిపారు. మండలానికి చెందిన పలువురు నేతలు పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరిని కోరారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్ళి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లింగ వివక్షపై అవగాహన కలిగి ఉండాలి

క్రోసూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) :కిశోరి బాలికలు లింగ వివక్షపై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడీ సూపర్వైజర్ వణుకూరి మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో లింగ వివక్షపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు తరచుగా లింగ వివక్షకు గురికావటం శోచనీయమన్నారు. ఈ విషయమై పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు. ట్రాన్స్ జెండర్లను చిన్న చూపు చూడకూడదని ఈ సందర్భంగా తెలిపారు. ఆమెతో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి పరితపిస్తున్న.. పురావస్తుశాల



శిలాఫలకాలు

దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం నాగార్జున కొండ

ఆధునికీకరణకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవ


టూరిజం అభివృద్ధికి కేంద్రం రూ. 25 కోట్ల కేటాయింపు

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాగార్జున కొండ మ్యూజియం అభివృద్ధిని కాంక్షిస్తోంది. శిల్ప కళాఖండాలు, నాగార్జునుని, బుద్ధుని, శాతవాహనలు, ఇక్ష్వాకుల కాలంనాటి ప్రజల జీవనశైలికి ప్రత్యక్ష నిదర్శనం ఈ మ్యూజియం. ఇక్కడ 3, 4వ శతాబ్దపు చరిత్రను కనులకు కడుతుంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ పురావస్తుశాల అభివృద్ధిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గుర్తించారు. ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా కృషి చేశారు. కానీ, ఈ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది.

దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం



భారతదేశంలో ఏకైక ఐల్యాండ్ మ్యూజియంగా నాగార్జున కొండ ప్రపంచంలోనే రెండో అతి పెద్దది. కొండపై ఉన్న ఈ మ్యూజియం చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తోంది. 23 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి నాగార్జున కొండ లోయప్రాంతం అపార జలరాశిలో లీనమై ఉంది. తూర్పున ఫిరంగి మోటు, దక్షిణాన ఎద్దనమోటు కొండల మధ్య గల నాగార్జున కొండ పొంగిన కృష్ణానది జలాశయంలో అద్భుత ద్వీపంగా మారింది. ప్రాచీన కాలాన ఈ కొండను శ్రీ పర్వతమని, మధ్యయుగం నుంచి నాగార్జున కొండగా పిలువబడుతోంది. 1929 ప్రాంతంలోనే నాగార్జున కొండకు దిగువన మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం నదీ జలాలతో మునిగిపోయే సమయంలో 1966లో నాగార్జున కొండపై ప్రస్తుతం ఉన్న మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో నివసించడం వల్ల దీనికి నాగార్జున కొండని పేరొచ్చింది. 1926 మార్చిలో శాసన పరిశోధన కార్యాలయ ఉద్యోగి ఏఆర్ సరస్వతి దృష్టి ఈ ప్రాంతంపై పడింది. 1927-31 నాటికి విశేషంగా తవ్వకాలు జరపగా కొన్ని స్తూపాలు, విహారాలు, శిలాఫలకాలు, 1938-40 తవ్వకాల్లో శిలా శాసనాలు బయల్పడ్డాయి. 1954-60 మధ్య సాగిన తవ్వకాల్లో బౌద్ధ నిర్మాణాల గురించి విశేషంగా లభ్యమయ్యాయి. వీటిలో ప్రాగ్ హైతిహాస అవశేషాలు, వివిధ వైదిక మత, గృహ నిర్మాణాలు వెలుగుచూశాయి. 1955 డిసెంబరు 10న నాగార్జున సా గర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియం నిర్మించాలని ఆదేశించారు. శిథిలాల్లో కొన్నింటిని యథాతదంగా ఈ కొండపై పునర్నిర్మించారు. మరికొన్నింటిని కొలమాన ప్రతిరూపంగా ప్రదర్శించబడ్డాయి. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు నిరంతరాయంగా నాగార్జున కొండ ప్రాంతం..మానవ నివాస స్థలంగా బాసిల్లుతోంది.



మ్యూజియం లోపలి భాగం



మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం

ఎంపీ లావు చొరవతో రూ.25కోట్ల కేటాయింపు..కానీ..

గత పార్లమెంట్ సమావేశాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధికి నిధు లు కేటాయించాలని కోరారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో రూ.25 కోట్లు కేటాయించింది. పర్యాటక కేంద్రం ఏర్పడి 75 సంవత్సరాల తరువాత అభివృద్ధి కోసం భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయడం ఇదే మొదటిసారి. నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో ఐ ల్యాండ్‌పై ఏర్పాటు చేసిన మ్యూజియంకు నేటి వరకు బడ్జెట్ కేటాయింపు లేక సరైన అభివృద్ధికి నోచుకోలేదు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 25 కోట్లు పొందుపరిచారే గానీ ఆ నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. పర్యాటకులకు వసతి గృహాలు, పార్కుల అభివృద్ధి, నూతన లాంచీలు, హోటళ్లు, రిసార్ట్స్, మౌలిక వసతులు, సుందరీకరణను అభివృద్ధి చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన నిధులు త్వరగా మంజూరు చేస్తే నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధి చెంది పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

నల్లమడ వాగు విస్తీర్ణం పెంచాలి

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమడ వాగు పూడిక తొలిగించి వాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. వాగు విస్తీర్ణం పెంచడానికి కావాల్సిన భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నీటిపారుదల, డ్రెయినేజీశాఖల పరిధిలో నిర్వహించే ఆపరేషన్ అండ్ నిర్వహణ పనులను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో నల్లమడ వాగులో కోతకు గురవుతున్న కరకట్ట ప్రాంతాన్ని సందర్శించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే కొమ్మమూరు కెనాల్, పీటీ చానల్‌ను, నరసాయపాలెంలోని లాక్‌ల వద్ద చానల్స్ పరిశీలించారు. కట్టపై మొక్కలు నాటి నీరు పోశారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ పూడికతొలిగించి ట్యాంక్ విస్తీర్ణాన్ని పెంచి నీటి నిల్వ సామార్థ్యాన్ని పెంచాలన్నారు. దానికి సంబంధించిన ప్రతిపాధనలను తయారు చేయాలని నీటిపారుదలశాఖ ఎస్ఈకి కలెక్టర్ సూచించారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నుంచి నీటి సరఫరా 35 నుంచి 60రోజులకు పెంచాలని చెప్పారు. నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్‌లో గుర్రపు డెక్క, తూటికాడ తొలిగింపు పనులను కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. నరసాయపాలెం పంచాయతీ ప్రజలు అక్కడ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పంచాయతీలో చెత్తసేకరణ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ రాజును కలెక్టర్ ప్రశ్నించారు. పంచాతీయకి ఎస్‌డబ్ల్యూ పీసీ ల్యాండ్ కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ సూచించారు. తదుపరి నల్లమడ వాగు లాక్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరత్నం, డ్రెయినేజి ఈఈ మురళీకృష్ణ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బ్లాక్ రైస్ బహుబాగు.. రెడ్ రైస్ రెడీ

-నూతన వంగడాల్లో బాపట్లకు అగ్రస్థానం



బ్లాక్ రైస్

ఆవిష్కరణకు సిద్ధమైన రెడ్ రైస్

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): పోషకాలు మెండుగా ఉండే అద్భుత వంగడాల సృష్టిలో బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 14 రకాల వరి వంగడాలను ఆవిష్కరించారు. మరో నాలుగు రకాలు విడుదలకు సిద్ధం చేస్తున్నారు. వాటిల్లో రెడ్ రైస్‌తోపాటు మరో మూడు వంగడాలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న బీపీటీ 5204 (సాంబమసూరి) రకాన్ని రూపొందించిన ఇక్కడ శాస్త్రవేత్తలు తాజాగా బ్లాక్ రైస్, రెడ్‌రైస్‌ను రూపొందించారు. బ్లాక్ రైస్ ఇప్పటికే విడుదలై ప్రాచుర్యం పొందింది. రెడ్ రైస్ మినీకిట్‌లు పంపిణీ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

బ్లాక్‌రైస్-2841

దశాబ్దాలుగా రైతు సేవలో కొనసాగుతున్న ఈ పరిశోధన స్థానం బీపీటీ 2841 పేరుతో బ్లాక్ రైస్ వంగడాన్ని విడుదల చేసింది. బ్లాక్ రైస్‌లో బియ్యం పొర నలుపు రంగులో ఉండటం వల్ల ఫినాల్స్, ఫ్లావినాయిడ్స్ యాంటీ ఆక్సీడెంట్ యాక్టీవిటి ఎక్కువగా ఉంటాయి. దీనిని ఆహారంగా తీసుకున్నప్పుడు మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. దీంతోపాటుగా ప్రొటీన్, జింకు, ఇనుము, పీచు పదార్థాలు కూడా అధిక మోతాదులో ఉన్నట్లు నమోదు చేయబడింది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో బ్లాక్ రైస్ రూ.300లకు పైగా విక్రయిస్తున్నారు. ఆరోగ్యవంతమైన, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగిన నల్ల ధాన్యం పంట కాలం 130 నుంచి 135 రోజులు ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నల్ల ధాన్యం సాగు క్రమంగా విస్తరిస్తోంది. ఈ బియ్యాన్ని ఉడికించినప్పుడు అన్నం ముద్దగా మారుతుంది. అందువల్ల రోజు ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోలేం. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. ఆర్గానిక్‌సాగు కింద పండించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ధాన్యం సన్నగా ఉంటాయి. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నల్ల వరివిత్తనాలు సాగు చేస్తున్నారు. ఇందులో ఆశించిన ఫలితాలు రావడంతో రైతులు నుంచి ఈ విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది సీడ్ కిలో రూ.77.8 లు చొప్పున విక్రయించేందుకు సిద్ధం చేశారు. విత్తనాలు కోసం ఇప్పటికే అనేక మంది రైతులు దరఖాస్తు పెట్టుకున్నారు.

రెడ్‌రైస్- 2858

బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రెడ్ రైస్‌ను రూపొందించారు. ఇప్పటికే ఇది మినీ కిట్‌ల రూపంలో రైతులకు అందించి ఫలితాలను పరిశీలించారు. దీనిని ఈ ఏడాది విడుదల చేసే అవకాశం ఉంది. బీపీటీ-2858 పేరుతో రెడ్ రైస్‌ను రూపొందించారు. జింకు, ఐరన్, సూక్ష్మపోషకాలు ఇందులో అధికంగా ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో పండించే ముతక రకం కాకుండా సన్న బియ్యంగా బాపట్ల రెడ్‌రైస్ ఉంటుంది. ప్రజలు తినేందుకు ఆసక్తి చూపించే విధంగా శాస్త్రవేత్తలు దీనిని రూపొందించారు. ప్రీ రిలీజు కల్చర్ కింద ఈ విత్తనాలను కిలో రూ.50కు అందించేందుకు సిద్ధం చేశారు. ఇక్కడ విత్తనాలను రీసెర్చ్ సెంటర్‌లకు, దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు, ప్రైవేట్ కంపెనీలకు అందించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు



పరిశోధన స్థానం రూపొందించిన బ్లాక్ అండ్ రెడ్ రైస్ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి లభిస్తుంది. 2023లో బ్లాక్ రైస్ విడుదల చేశాం. దీనిని అందరూ సాగు చేస్తున్నారు. రెడ్ రైస్ మినీ కిట్స్ ప్రక్రియ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. ఆరోగ్యానికి అత్యంత అనుకూలమైన రకాలుగా పరిశోధనలో తేలింది. రైతులు, ప్రైవేట్ కంపెనీలు, సాగు చేసుకునేందుకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది.

- డాక్టర్ జీ కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రోడ్డు ప్రమాదాలను 50శాతం తగ్గించాలి

● జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావు పేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో సగటున నెలకు 50 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసరంగా ప్రమాదాల సంఖ్య 25కి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు జిల్లా రహదారి భద్రత కమిటీ, మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2023, 2024లో జిల్లాలో వరసగా 576, 612, 2025 ఏప్రిల్ నాటికి 263 ప్రమాదాలు జరిగాయని గణాంకాలు వివరించారు. 2024లో 380 మంది మరణిం చగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లో 152 మరణాలు సంభవించాయని తెలిపారు. ద్విచక్ర, భారీ వాహనాలు అత్యధిక ప్రమాదాలకు కారణమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలోని అన్ని రోడ్లపై తనిఖీలు నిర్వ హించాలని చెప్పారు. కాలేజీ విద్యార్థులు, రైతు కూలీలు పరిమి తికి మించి ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించడం ఎంత ప్రమాదమో వివరించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 34 బ్లాక్ స్పాట్లలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు రోడ్డు ప్రమాదాల సరళిని మెరుగ్గా అంచనా వేయడంలో తోడ్పడుతున్నా యన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేని డ్రగ్స్ అమ్మకాలను నిరోధించండి

ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అమ్మకాలను నిరోధించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, డీఎంహెచ్ఓ రవి, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఐదు స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

● ఆరు కేంద్రాల రద్దు

● ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన పీసీ పీఎన్‌డీటీ కమిటీ సమావేశం

గుంటూరు మెడికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వెల్లడిస్తే జైలు శిక్ష తప్పదని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం (పీసీ పీఎన్‌డీటీ యాక్ట్)పై జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి చట్టం గురించి, జిల్లాలో దాని అమలును వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ముందుగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఐదు స్కానింగ్ కేంద్రాల అనుమతులకు, ఆరు స్కానింగ్ కేంద్రాలు రద్దుకు, మరో 25 కేంద్రాలు మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారని డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి తెలిపారు. వీటికి కలెక్టర్ ఆమోదం తెలిపారు. కృత్రిమ గర్భధారణ పద్ధతులపై వైద్య చికిత్సలు అందించే లెవెల్ 1 స్థాయిలో రెండు ఆసుపత్రులు, లెవెల్ 2 స్థాయికి ఒక ఆసుపత్రి దరఖాస్తు చేసుకున్నట్లు డీఎంహెచ్‌వో చెప్పగా, కలెక్టర్ ఆమోదించారు. సరోగసి కేంద్రం దరఖాస్తు గురించి చెప్పగా.. ఆ కేంద్రం పాత సరోగసి కేసులు వివరాలు ఆరోగ్య శాఖకు అందజేస్తే, పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీడ్స్ డైరెక్టర్ డి.రోషన్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర ఆదిలక్ష్మి, డాక్టర్ రవీంద్ర నాయక్, డీపీఆర్‌వో శ్యామ్‌కుమార్, డెమో ఎ.జయప్రసాద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వాణి, నిర్మల మేరి పాల్గొన్నారు.

వర్ష బీభత్సం..

◆ తడిచిన మొక్కజొన్న, పచ్చి ఇటుకలు ◆ అకాల వర్షాలతో తీవ్ర నష్టం



వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలు

కొల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం తెల్లవారుజామున వర్షం భీభత్సం సృష్టించింది. కొల్లూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. ఈ వర్షానికి మాగాణి పొలాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు పూర్తిగా తడిసిపోయాయి. లంక గ్రామాల్లో తుది దశకు వచ్చిన ఇటుక పరిశ్రమను వర్షాలు వెన్నాడటంతో పరిశ్రమదారులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం కురిసిన వర్షం ధాటికి కల్లాల్లో ఆరబెట్టిన లక్షలాది పచ్చి ఇటుకలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. ఎన్నడూ లేని విధంగా మే నెలలో అకాల వర్షాలు కురవడం వల్ల మొక్కజొన్న రైతులు, ఇటుక పరిశ్రమదారులు కోలుకోని విధంగా దెబ్బతిన్నారు. భారీ వర్షం ధాటికి రోడ్లు మొత్తం పూర్తిగా జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లోని గృహాలు సైతం వర్షపు నీరు చేరింది. మురుగు కాల్వలు పొంగి పొర్లడంతో మురుగు మొత్తం రోడ్లపైకి చేరి రోడ్లన్ని జుగుప్సాకరంగా మారాయి. పిడుగులు దాటికి కొన్ని గృహాల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మేలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావించినప్పటికీ అకాల వర్షాలతో వర్షాకాలాన్ని తలపిస్తుంది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.



తడిసి పోయిన పచ్చి ఇటుకలు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


జూన్ 6 నుంచి న్యాయవాదులకు వృత్తి నైపుణ్య శిక్షణ

నరసరావుపేట లీగల్, మే 20, (ఆంధ్రజ్యోతి), ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జూన్ 6, 7,8 తేదీలలో కేఎల్ యూనివర్సిటీలో జూనియర్ న్యాయవాదులకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బీరన్ సలీం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల న్యాయవాదులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకుని మూడు రోజుల శిక్షణ తరగతులకు హాజరై వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల ముందు నుంచే యోగాపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జూన్ 21న ప్రధాని మోడీ విశాఖపట్నంలో పాల్గొంటారని, ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని, ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తూ యోగా చేసేలా ఏర్పాట్లను గావించాలని అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలను జారీ చేశారు. ఈ నెల 21 నుంచి కాంపెయిన్ ప్రారంభం అవుతుందని, యోగా చేయడంపై ప్రజలలో చైతన్యం కలిగించి, ప్రతి ఒక్కరూ యోగాభ్యసనంలో పాల్గొనేలా చేయాలని కోరారు. ముందుగా మండలానికి ఇద్దరేసి యోగా శిక్షకులను గుర్తించి వారి ద్వారా టీవోటీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, టీవోటీల ద్వారా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. టీవోటీకోసం ప్రతి గ్రామం, వార్డు నుంచి ఒకరు చొప్పున ఎంపికచేసి ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు వారి వివరాలను పంపాలని తెలిపారు. ఈ నెల 22 నుంచి 27 వరకు వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లకు ఐదు రోజులు చొప్పున, యోగా నేర్చుకునే వారికి 3రోజుల పాటు శిక్షణ ఉంటుందని, వీరందరికీ యోగా పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జూన్ 16 నుంచి 19 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరూ తప్పక యోగాభ్యాసనం చేయాలన్నారు. జూన్ 16న ఫ్యామిలీ యోగా పేరుతో నాలుగు తరాల కుటుంబ సభ్యులంతా పాల్గొనేలా చూడాలని, 17న సీనియర్ సిటిజన్స్ కోసం స్పెషల్ యోగా కార్యక్రమాలు ఉంటాయని, 18, 19 తేదీలలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఈ కార్యక్రమాలను ఆయా స్థాయిలలో నిర్వహిస్తారని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు, నియోజక వర్గం ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ నెల 21న నాలుగు గంటలకు కోడెల శివప్రసాద్ క్రీడా ప్రాంగణంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం జరుగుతుందని, జిల్లా ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు

గుంటి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి ఆంజనేయస్వామి

వినుకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన జరగనున్న హనుమాన్ జయంతి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మాలధారణ స్వాములతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు, దేవాలయ ఆవరణలో హోమాలు నిర్వమించారు. అనంతరం దేవస్థానానికి వచ్చే భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మెరుగుపడిన డయేరియా బాధితుల ఆరోగ్యం

ఈపూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండాయిపాలెంలో సోమవారం ఫుడ్‌పాయిజన్ వలన వాంతులు, విరేచనాలతో సుమారు 20మంది అస్వస్థకు లోనయ్యారు. గ్రామంలో జిల్లా అధికారులు పర్యటించి అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం వాంతులు, విరేచనాలు అదుపులోకి వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. నీరసంగా ఉన్నవారికి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. వైద్య,ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన న్యాయవాద సంఘ సభ్యులు

నరసరావుపేట లీగల్, మే 20, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును నూతనంగా ఎన్నికైన కార్యవర్గ బృందం అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా సుబ్బారావు న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సదరు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన

రొంపిచర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, మునమాక సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం కిషోర వికాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లింగ వివక్షత, స్త్రీ, పురుష సమానత్వం గురించి వివరించారు. సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీమ్ సుల్తానా మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో కిషోర బాలికలు, అంగన్ వాడీ వర్కర్లు, ఆషా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆలయ పునః నిర్మాణం కోసం విరాళం

నరసరావుపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజార్, పులుపుల వారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ నిర్మాణానికి భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన (హీరో షోరూం) శ్రీ వెన్నం శ్రీనివాసరెడ్డి దంపతులు 1,01,116 రూపాయలను దేవస్థాన కమిటీవారికి అందజేశారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

వినుకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని నడిగడ్డ, దొండపాడు, భారతాపురం, పానకాలపాలెం, తిమ్మాయపాలెం గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత, త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి.పెద్దిరెడ్డి, వై.రమేష్, పి.రామయ్య, సి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టు పనులు చేపట్టాలి: రూబెన్

వినుకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల సాగు, తాగునీటి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి పులిమల రూబెన్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70ఏళ్లుగా రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం వరికపూడిశెలను సాకుగా చూపి లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి పల్నాడు ప్రాంత ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలి: పీడీఎం నాయకుల డిమాండ్

వినుకొండ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లి మేజర్ కాలువపై ఉన్న మైనర్ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విఠంరాజుపల్లి రైతులతో కలిసి శివారు రైలు పట్టాల దగ్గర ఎన్ఎస్‌పీ పంట కాలువలను మంగళవారం పరిశీలించారు. గత 50 సంవత్సరాల నుంచి ఈ కాలువ మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రైతు నాయకులు వై.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని లూఠీచేసిన జగన్

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



జాలాదిలో రూ.10లక్షలతో ఏర్పాటుచేసిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని విధాలా లూటీచేసి ఖాళీ డబ్బా ఇచ్చి వెళ్ళాడని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. యడ్లపాడు మండలం జాలాది గ్రామంలో 10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌లకు, రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న జాలాది-కొప్పర్రు మెటల్ రోడ్డుకు మంగళవారం ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ చేసిన తప్పులు, పాపాలతో ప్రజలకు, రాష్ట్రానికి మంచి చేయడంలో కూటమి ప్రభుత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాకే రోడ్ల మరమ్మతులు, నిర్మాణం వేగవంతమైందన్నారు. అనుసంధానిత రహదారులతో పాటు పొలాలకు వెళ్ళే డొంక రోడ్లను కూడా బాగుచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మాటలతో ప్రజలను మోసగించిందని, తమ ప్రభుత్వం అలా చేయదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ళు నిర్మించుకున్న వారికి చెల్లించాల్సిన బకాయిలు కూడా త్వరలోనే అందుతాయని ప్రత్తిపాటి తెలిపారు. అలాగే తమ ప్రభుత్వం రానున్న మూడు నెలల్లో 3 పథకాలను అమలు చేయనుందన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం, ఆగష్టులో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని సరిచేస్తూనే చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కోసం కృషిచేస్తున్నాడన్నారు. మాట ఇచ్చాక వెనుకడుగు వేయరని, వచ్చే నెలలో ప్రభుత్వం కొత్తగా లక్ష సామాజిక పింఛన్లు మంజూరు చేయబోతున్నదని అర్హులైనవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేసే సీఎం చంద్రబాబుకు మోదీ సహకారం ఉండబట్టే జగన్‌చేసిన అప్పులు తీర్చుకుంటూ మరోవైపు అభివృద్ధి, సంక్షేమం ఏకకాలంలో కొనసాగించడం జరుగుతోందన్నారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూడా ప్రభుత్వం పెద్దఎత్తున కృషిచేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాగునీటి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని, ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు గ్రామ ప్రజల నీటి అవసరాలకు సరిపోనందున మరో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని, ఎస్సీ కాలనీల నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయించాలని కోరారు. పొలాలకు, కొప్పర్రు గ్రామం మీదుగా పెదనందిపాడు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నందున మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డి, టంగుటూరికి ఘన నివాళి



కాసు బ్రహ్మానందరెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో కాసు బ్రహ్మానందరెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాసు బ్రహ్మానందరెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి క్యాంపు కార్యాలయంలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి, రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిన మహామనిషి టంగుటూరి ప్రకాశం పంతులన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి, హోమ్ మంత్రి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, గవర్నర్, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకుంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి కాసు బ్రహ్మానందరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో 20 నుంచి 30 కేంద్ర వాణిజ్య సంస్థలు తీసుకొచ్చారన్నారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో రైల్వే సౌత్‌సెంట్రల్ జోన్‌ను కేంద్రప్రభుత్వానికి ఒప్పించి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో యన్నం రాధాకృష్ణరెడ్డి, కానాల చెంచిరెడ్డి, మద్ది రామబ్రహ్మానందరావు, మాజీ జెడ్‌పీటీసీ అక్తాబ్, పొట్టి ఆంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కపలవాయి రాజేంద్రప్రసాద్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం

● సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయులు నాయక్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, మే 20: స్వాతంత్రోద్యమ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లలోకి మార్చి కాల రాస్తోందని, పోరాటల ద్వారా ఆ హక్కులను, చట్టాలను కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. మంగళవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణలోని వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పట్టణ ప్రధాన వీధులలో లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాటాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం కార్మికుల పొట్టకొట్టడమేనన్నారు. కార్మికుల హక్కుల కాలరాసేలా ఉన్న ఈ లేబర్‌కోడ్‌ల వలన 8గంటల పని విధానం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజులలో 10 గంటల నుంచి 12 గంటల పని చేయాల్సి వస్తుందని, కార్మికులు ఇబ్బందులు పడే పరిస్థితి దాపురిస్తుందన్నారు. లేబర్‌కోడ్ అమలు జరిగితే కార్మికులు శ్రమదోపిడీకి గురై యాజమాన్యాలకు లాభం చేకూర్చి పెడుతుందన్నారు. కనీస వేతనం చట్టం ప్రకారం కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 9న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, రంగయ్య, సత్యనారాయణ, రాజు, షేక్ సిలార్ మసూద్, డీ శివకుమారి, జీ మల్లేశ్వరి, అల్లాభక్షు, వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి: బూదాల



శివయ్యస్థూపం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వినుకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అందించాలంటూ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు వినుకొండ నియోజకవర్గ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శివయ్యస్థూపం సెంటర్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా కుదించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండ్రముట్ల సుభాని, రాయబారం వందనం, కొప్పెరపు మల్లికార్జున, ఎస్‌కే మస్తాన్, వెంకటేశ్వర్లు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



పంట కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యపు నీటికుంట (ఫాం పాండ్) నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షపు నీరు వృథా కాకుండా రైతులందరు తమ పంట పొలాలలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు రైతులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నరసరావుపేట లీగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మార్గదర్శకత్వం లో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ మంజుల జగన్మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో 43 మంది రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. రక్తదాతలకు డీఆర్వో ఏకా మురళి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డిప్యూటీ కలెక్టర్ కుమార్, ఏవో లీల సంజీవ్ కుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, వివిధ పార్టీల నాయకులు

చిలకలూరిపేట, మే20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని రైతు బజార్ వద్ద ఉన్న మదర్ థెరీసా విగ్రహం నుంచి గడియార స్తంభం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ర్యాలీని ప్రారంభించారు. యుద్ధంలో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించిన భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. జాతీయ జెండా చేతబట్టుకుని ర్యాలీలో పలు పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

ఏపీజీఈఏ మూడో కౌన్సిల్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం రాష్ట్ర మూడో కౌన్సిల్ మహాసభల పోస్టర్‌ను మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక అధ్యక్షుడు బాజీ పఠాన్ ఆవిష్కరించారు. జూన్ 5న విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జరిగే ఉద్యోగుల భారీ మహాసభకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ముందుగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో జేసీ గనోరే సూరజ్ ధనుంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగల సంఘం అధ్యక్షులు శాంతి బాయి, ఏపీజీఈఏ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు, జీ వందనం బాబు, తాలూకా అధ్యక్షురాలు ఎం.ఫ్లోరెన్స్ బాజీ, మాధవి, దేవి, రేణుక పాల్గొన్నారు.



నరసరావుపేట పట్టణంలో కమ్ముకున్న మబ్బులు

జిల్లా అంతటా చిరు జల్లులు

● 29 డిగ్రీలకు తగ్గిన ఉష్ణోగ్రతలు ● ఉక్కపోతకు ఉపశమనం

నరసరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా బుధవారం తెల్లవారు జామునుంచి చిరు జల్లులు పడ్డాయి. భానుడి భగభగలతో తల్లడిన ప్రజలకు ఉక్కపోత నుంచి చిరు జల్లులు ఉపశమనం కలిగించాయి. 42 డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గాయి. బుధవారం జిల్లాలో 29 నుంచి 34 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణ ఉష్ణోగ్రత కన్నా 8 నుంచి 10 డిగ్రీలు తక్కువగా నమోదైంది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

అకాల వర్షంతో అన్నదాతలకు ఇక్కట్లు



రొంపిచర్ల మార్కెట్ యార్డులో ఆరబోసిన మిర్చి

రొంపిచర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కురుస్తున్న అకాల వర్షానికి అన్నదాతలు ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో మిర్చి తడవకుండా పరదా పట్టలను కప్పారు. స్థానిక మార్కెట్ యార్డులో పోసిన మిర్చిని గోడౌన్ భాగంలోని రేకుల కింద ఆరబోశారు. ధర లేక ఒక రకంగా ఇబ్బంది పడుతుంటే వర్షంతో మరోరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు.



రజక కాలనీలో తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

వినుకొండ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని రజక కాలనీ ప్రజల దాహార్తి తీర్చేందుకు సుమారు రూ.20లక్షలతో 250 ఇళ్లకు తాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ముందుగా కాలనీలోని మహిళలు, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని ప్రజా ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరమఠం మహాద్వారం ప్రారంభం



మహాద్వారంను ప్రారంభిస్తున్న విధుశేఖర భారతీ మహాస్వామి

నరసరావుపేట కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశృంగేరి శంకర మఠంలో నూతనంగా నిర్మించిన మహాద్వారాన్ని మంగళవారం విధుశేఖర భారతీ మహాస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఘనస్వాగతం పలికారు. స్వామివారి రాకను పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున శంకరమఠానికి చేరుకున్నారు. మహాద్వారాన్ని ప్రారంభించిన అనంతరం స్వామివారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల నుద్దేశించి అనుగహభాషణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కపలవాయి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.